సాక్షి నిర్మల్

సోమవారం ∣ 1 ∣ జనవరి ∣ 2024



జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థినులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



కాలచక్రం గిర్రున తిరిగింది. మరో ఏడాది కనుమరుగైంది. మంచి, చెడులను జ్ఞాపకాలుగా మిగిల్చింది. జిల్లా వాసులు 2023కు ఘనంగా వీడ్కోలు పలికారు. నయా జోష్ మొదలైంది. కొత్త ఆశలు, ఆకాంక్షలు, ఆశయాలను మోసుకొని వచ్చిన 2024కు ఘన స్వాగతం పలికారు జిల్లా వాసులు. యువ ఆలోచనలు వెల్లివిరిసేలా.. అనుభవాల మార్గదర్శనంలో.. నవశకానికి నాంది పలికేలా.. విజయ సోపానాలు వీడకుండా.. లక్ష్యాలను సాధించాలని కోరుకుంటూ హ్యాపీ న్యూ ఇయర్.

నయా.. జోష్

న్యూస్‌రీల్

సందడిగా 'కడెం'



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

కడెం: కడెం ప్రాజెక్ట్ పరిసరాలు ఆదివారం పర్యాటకులతో సందడిగా మారాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి బోటు షికారు చేశారు. వనభోజనాలు చేసి ఆటాపాటలతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు.

జూడోలో క్రీడాకారుల సత్తా



జూడోలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. అభినయ సిల్వర్, అఖిల, సోను బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి, ఎస్జీఎఫ్ సెక్రటరీ రామారావు, జూడో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాయికిరణ్ క్రీడాకారులను అభినందించారు.

నేడు 'స్వర్ణ' నీటి విడుదల

సారంగపూర్: మండలంలోని స్వర్ణ ప్రాజెక్ట్ నీటిని సోమవారం నుంచి విడుదల చేస్తున్నామని ఇరిగేషన్ ఎస్ఈ రామారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్ట్ మూడు ప్రధాన కాలువల ద్వారా సాగునీరు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆయకట్టు రైతులు, అధికారులు, పాలకులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కనకాపూర్ వాగులోకి సరస్వతి కాలువనీరు



ఆనకట్ట పైనుంచి దుంకుతున్న సరస్వతి నీరు

లక్ష్మణచాంద: మండల రైతులకు వరప్రదాయినిగా పిలవబడే సరస్వతి కాలువకు కొద్దిరోజులుగా నీరు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, సరస్వతి కాలువనీటిని కనకాపూర్ వాగులోకి వదులుతున్నారు. దీంతో బాబాపూర్ సమీపంలో గల లక్ష్మణచాంద ఆనకట్ట పైనుంచి నీరు పరవళ్లు తొక్కుతోంది. ఈ దృశ్యం చూపరులకు ఆహ్లాదం పంచుతోంది. అటుగా వెళ్లిన ప్రజలు అక్కడ ఫొటోలు దిగుతున్నారు. స్నానాలు చేస్తూ సేద తీరుతున్నారు.

కూచిపూడిలో రాణిస్తున్న శ్రీఅన్వి



గిన్నిస్‌రికార్డు వేడుక అవార్డుతో శ్రీఅన్వి

నిర్మల్: సంప్రదాయ కళల్లో రాణిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటోంది శ్రీఅన్వి. జిల్లాకేంద్రంలోని కళానగర్‌కు చెందిన మచ్కుంటి లావణ్య, రాకేశ్ దంపతుల కుమార్తె శ్రీఅన్వికి చిన్నప్పటి నుంచి నృత్యంపై ఆసక్తి ఉండేది. గమనించిన తల్లిదండ్రులు నృత్యశిక్షకురాలు నవ్య వద్ద శిక్షణ ఇప్పించారు. అప్పటి నుంచి కూచిపూడిలో శ్రీఅన్వి రాటుదేలింది. పలు ప్రదర్శనల్లో తన కళతో ఆకట్టుకుంది. ఇటీవల హైదరాబాద్‌లోని గచ్చిబౌలి మైదానంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన గిన్నిస్‌బుక్ రికార్డ్స్ కార్యక్రమంలోనూ పాల్గొంది. ముందుందు తనదైన కళలో రాణించేందుకు కష్టపడతానని శ్రీఅన్వి చెబుతోంది.

మన్‌కీబాత్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు



టీవీలో కార్యక్రమాన్ని చూస్తున్న నాయకులు

భైంసాటౌన్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ప్రధాని మోదీ మన్‌కీబాత్ 108వ ఎపిసోడ్‌ను ఆదివారం బీజేపీ నాయకులు టీవీలో వీక్షించారు. వారు మాట్లాడుతూ.. మన్‌కీబాత్ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోందని చెప్పారు. కార్యక్రమం ద్వారా వివిధ వర్గాల ప్రజలతో మమేకమయ్యేందుకు ప్రధాని ఈ కార్యక్రమాన్ని చేపట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, మల్లయ్య, గోపాల్‌రెడ్డి, శ్రీధర్, సుధాకర్, భూమన్న, స్వామి, మనోజ్, సురేందర్ తదితరులున్నారు.

హ్యాపీ.. న్యూ ఇయర్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



బేకరీలో కేక్‌లు కొనుగోలు చేస్తున్న యువతులు

- ఈ ఏడాదంతా బాగుండాలె..
- అనుకున్న పనులన్నీ జరగాలె..
- అభివృద్ధి పరుగులు పెట్టాలె..
- జిల్లా కొత్తపుంతలు తొక్కాలె..
- అన్ని రంగాలూ బాగుపడాలె..
- మార్పు కోరుతున్న జిల్లా ప్రజలు

నిర్మల్: 2024.. కాలగమనంలో వచ్చిన కొత్తసంవత్సరం. ఇంట్లోకి కొత్త క్యాలెండర్ వచ్చినట్లే.. మనసుల్లోకి కొత్త ఆశలు, సరికొత్త లక్ష్యాలూ వచ్చిచేరుతాయి. కాలచక్రంలో ఎన్నో ఆంగ్ల సంవత్సరాలు కదిలిపోతున్నా.. నయాసాల్ అంటే తెలియని ఉత్సాహం. జరిగిందేదో జరిగిపోయింది.. పాత ఏడాది గడిచిపోయింది.. ఇక ఈ ఏడాదిలో కొత్తగా ఏదో సాధించాలన్న ఆరాటం ప్రతీ కామన్‌మ్యాన్‌లో కనిపిస్తుంది. ప్రతిఒక్కరూ ఎంతోకొంత మార్పు కోరుకోవడం సహజం. మనలాగే మన జిల్లా.. మార్పులు కోరుకుంటోంది. జిల్లావాసులు ఆశిస్తున్నట్లే అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తుంది. ఇందుకు తగ్గట్లు పాలకులు, అధికారులూ కొత్త ఏడాది లక్ష్యాలు పెట్టుకుంటున్నారు. వ్యక్తిగతంగా ఎలాగైతే అభివృద్ధి కోరుకుంటున్నారో.. కొత్త ఏడాదిలో నిర్మల్ జిల్లా కూడా అన్నిరంగాల్లో మరింత ముందుకు వెళ్లాలని ప్రతిఒక్కరూ ఆశిస్తున్నారు. రాష్ట్రంలోనే నిర్మల్.. అంటే ఓ మంచి స్థానంలో ఉండాలని కోరుకుంటున్నారు.

'కొత్త'మార్పు ఉండాలని..

కొత్త ఏడాది ప్రారంభానికి ఒక్కనెల ముందే రాష్ట్రంలో ప్రజలు కొత్తదనం కోరుకున్నారు. అందుకు తగ్గట్లు కొత్త సర్కారును ఎన్నుకున్నారు. జిల్లాలోనూ మూడు నియోజకవర్గాల్లో కొత్త ఎమ్మెల్యేలకు పట్టంకట్టారు. ఇక ప్రజలు ఎన్నుకున్న పాలకులు వారి అభీష్టానికి తగ్గట్లుగా నయాసాల్‌లో మార్పు చూపించాల్సిన బాధ్యత ఉంది. ఉమ్మడి జిల్లాలో మిగతా జిల్లాలతో పోలిస్తే అభివృద్ధికి కావాల్సిన సానుకూల అంశాలు మన నిర్మల్‌కే ఎక్కువ. జిల్లాలో గోదావరి నది సరిహద్దుగా ఉంది. గోదావరి ఉపనదులైన కడెం, స్వర్ణ జిల్లా వరప్రదాయినుల్లా ప్రవహిస్తున్నాయి. సాగు, తాగునీటి రంగాలకు ఎలాంటి ఇబ్బంది లేదు. హైదరాబాద్–నాగ్‌పూర్ ప్రధాన మార్గమైన ఎన్‌హెచ్–44, మరోవైపు మహారాష్ట్రలోని పలు ప్రధాన నగరాల నుంచి మంచిర్యాలవైపు వెళ్తున్న ఎన్‌హెచ్–61 రోడ్లకు కూడలిగా ఉంది. రోడ్డు, రవాణాపరంగా ఇబ్బంది లేదు. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులకు ఇబ్బంది కలిగించకుండా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాల్సిన అవసరముంది. మెడికల్‌కాలేజీ ప్రారంభమైనా పూర్తిస్థాయిలో వైద్యం ఇంకా కలగానే ఉంది. విద్యాపరంగా జిల్లా చాలా వెనుకబడి ఉంది. ఇప్పటికే ఉన్నతవిద్య అందని ద్రాక్షగానే మిగిలింది. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు తీసుకువస్తే ఉపాధితో పాటు ఉత్పత్తి పెరిగి రైతులు, యువతకు లాభసాటిగా ఉంటుంది. కొత్త ఏడాదిలోనైనా జిల్లా పర్యాటక శోభతో విరాజిల్లాలని జిల్లావాసులు ఆకాంక్షిస్తున్నారు. మొత్తం మీద తమ జీవితాలతో పాటు జిల్లా కొత్త మార్పులతో అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నారు.

ప్రజాసంక్షేమానికి ప్రాధాన్యం



ముందుగా జిల్లావాసులందరికీ హ్యాపీ న్యూఇయర్. ఈ కొత్త ఏడాదిలో ప్రజాసంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నాను. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలందరికీ అందిస్తాం. జిల్లాలో గిరిప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల కష్టాలు తీర్చేందుకు కృషిచేస్తాను. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తా. ఇక వ్యక్తిగతంగా.. ఆరోగ్యం, వ్యాయామంపై దృష్టి పెట్టాలని అనుకుంటున్నాను.

– ఆశీష్‌సంగ్వాన్, కలెక్టర్

ఏడాదిలో నాలుగు లక్ష్యాలు



కొత్త ఏడాదిలో పోలీస్‌శాఖ తరఫున ప్రధానంగా నాలుగు లక్ష్యాలు పెట్టుకుంటున్నాం. డ్రగ్స్ రహిత జిల్లాగా చేయడం, మహిళల భద్రత, సంక్షేమం, రోడ్డుప్రమాదాలను పూర్తిగా నివారించడం, మున్సిపాలిటీల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని అనుకుంటున్నాం. వీటితోపాటు శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసుల సంక్షేమానికి వివిధ కార్యక్రమాలు చేపడతాం. వ్యక్తిగతంగా పిల్లల చదువులు, ఇంటిల్లిపాది ఆరోగ్యంపైనా దృష్టి పెట్టాలనుకుంటున్నాను.

– ప్రవీణ్‌కుమార్, ఎస్పీ

ప్రతిమహిళకూ ఉపాధినిచ్చేలా..



కొత్తసంవత్సరంలో శాఖ తరఫున పలు లక్ష్యాలు అనుకున్నాము. ఈ ఏడాది కొత్తగా చేపల పెంపకం చేసే మహిళలతో ఎఫ్‌పీవో (రైతు ఉత్పత్తి సంఘం) ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. ప్రస్తుతం చేపట్టిన సమీకృత వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహిస్తాం. ప్రతీ మహిళకు ఉపాధి లభించేలా పీఎంఎఫ్ఎంఈ ద్వారా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తాం. ఉపాధిహామీ ద్వారా పనిదినాలన్నీ సద్వినియోగమయ్యేలా చేస్తాం. – విజయలక్ష్మి, డీఆర్డీవో

బైబై 2023.. వెల్‌కమ్ 2024



నాన్ వెజ్ వంటకాలు కొనుగోలు చేస్తున్న జనం

- పాత ఏడాదికి వేడుకగా వీడ్కోలు
- నయాసాల్‌కు ఘనంగా స్వాగతం
- జిల్లావ్యాప్తంగా థర్టీఫస్ట్ జోష్
- 'న్యూఇయర్ ఫస్ట్'.. కోసం సిద్ధం

నిర్మల్: 'బైబై.. ఓల్డ్ ఇయర్..' అంటూ 2023 సంవత్సరానికి జిల్లా వేడుకగా వీడ్కోలు పలికింది. అంతే జోష్‌తో 'హ్యాపీ... న్యూఇయర్...' అంటూ కొత్తగా మొదలైన 2024సంవత్సరానికి ఘనస్వాగతం చెప్పింది. జిల్లావాసులు ఆదివారం అర్ధరాత్రి వరకు పాత ఏడాది ముగింపువేళ వీడ్కోలు పార్టీగా చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా థర్టీఫస్ట్ జోష్ కనిపించింది. జిల్లాకేంద్రంలో ప్రముఖ హోటళ్లతో పాటు ప్రధాన రహదారి వెంట రాత్రివరకూ నాన్‌వెజ్ స్నాక్స్ విక్రయాలు చేపట్టారు. చాలాచోట్ల డీజే పాటలు పెట్టుకుని పిల్లలు, యువత డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. సరిగ్గా అర్ధరాత్రి 12గంటలకు పటాకులు కొడుతూ.. హ్యాపీ న్యూఇయర్ అంటూ కేరింతలతో స్వాగతం పలికారు. కేక్‌లు కట్ చేసి.. ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అలాగే.. ఏడాదిపాటు మరిచిపోలేని జ్ఞాపకాల మూటకట్టిచ్చిన 2023కు భారంగా బైబై.. చెప్పారు. మరోవైపు చర్చిల్లో అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసారి కేక్‌లతో పాటు నాన్‌వెజ్ వంటకాలకు ఫుల్‌గిరాకీ కొనసాగింది. మద్యం ప్రియులతో వైన్స్‌లు కిటకిటలాడాయి. మరోవైపు పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్‌పై సీరియస్‌గా దృష్టిపెట్టారు.

న్యూఇయర్‌కు సిద్ధం..

కొత్త సంవత్సరం వేడుకలకు జిల్లా సిద్ధమైంది. నూతన ఏడాది ప్రారంభం సందర్భంగా సోమవారం ఆలయాల సందర్శనకు ప్రజలు సిద్ధమవుతున్నారు. చర్చిల్లోనూ న్యూఇయర్ ప్రార్థనలు కొనసాగనున్నాయి. చాలామంది ఉదయాన్నే సమీపంలో ప్రముఖ ఆలయాలకు వెళ్లేందుకు ముందే ప్లాన్ చేసుకున్నారు. న్యూఇయర్ ఫస్ట్ రోజున సెలవు ఉండటంతో ఇంటిల్లిపాది ఉల్లాసంగా గడిపేందుకు సిద్ధమవుతున్నారు.

స్వచ్ఛందంగా సీసీ కెమెరాల ఏర్పాటు

- ఆదర్శం.. ఫ్రెండ్స్ సొసైటీ



సీసీ ఫుటేజీకి చిక్కిన చోరీ నిందితుడి దృశ్యం

ఖానాపూర్: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన ఫ్రెండ్స్ సొసైటీ సభ్యులు ఇటీవల కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. కాలనీలో దొంగల అలజడితో పాటు అల్లరిమూకలపై నిఘా, కలప అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా ముందస్తుగా ఆయా నివాసాల వారంతా ఫ్రెండ్స్ సొసైటీగా ఏర్పడ్డారు. అనంతరం సుమారు 40 కుటుంబాల వారు రూ.3వేల నుంచి రూ.5వేల చొప్పున విరాళాలు సేకరించి రూ.లక్షన్నరతో కాలనీలోని పలు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఇటీవల ఒక గుర్తు తెలియని వ్యక్తి చోరీకి యత్నించగా సీసీ కెమెరాలో రికార్డయింది. సీసీ ఫుటేజీని సేకరించిన పోలీసులు నిందితుడిని పట్టుకునే పనిలో పడ్డారు. అన్ని కాలనీల్లోనూ ప్రజలు, వ్యాపారులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఇదే తరహాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని ఈ సందర్భంగా అవగాహన కల్పించారు.

సఫాయిలకు సలాం..



వీధిని శుభ్రం చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు



విధులకు హాజరై మస్టర్ వేసుకుంటున్న పారిశుధ్య కార్మికులు

జిల్లా కేంద్రంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఉదయం 4గంటలకు ఎముకలు కొరికే చలిలోనూ విధులకు హాజరవుతున్నారు. పట్టణ పరిశుభ్రతకు పాటుపడుతున్న వీరికి బల్దియా కనీసం స్వెట్టర్లు, మాస్కులు, గ్లౌస్‌లు కూడా అందించడంలేదు. అయినా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు విధి నిర్వహణలో ఏమాత్రం వెనుకడుగు వేయడంలేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

అస్తవ్యస్తంగా వాహనాల రాకపోకలు



మహారాష్ట్రకు వెళ్లేందుకు సిద్ధంగా ఊక లారీలు

భైంసాటౌన్: డివిజన్ కేంద్రమైన భైంసా నుంచి భైంసా–బాసర, భైంసా–నాందేడ్ జాతీయ రహదారి మీదుగా నిత్యం పదులసంఖ్యలో వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్నాయి. పట్టణంతోపాటు నియోజకవర్గంలోని పలు రైస్‌మిల్లుల నుంచి మహారాష్ట్రలోని నాందేడ్, ఉమర్‌ఖేడ్, తాంశ, ఔరంగబాద్ తదితర ప్రాంతాలకు ఊక (బూస) లోడ్‌తో లారీలు ప్రమాదకరంగా వెళ్తున్నాయి. దీంతో లారీల్లోని ఊక గాలికి లేచి వాహనదారుల కళ్లలో పడుతుండడంతో పలుసార్లు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. స్థానిక రవాణాశాఖ చెక్‌పోస్ట్ ఎదురుగా ప్రమాదకరంగా వాహనాలు తరలుతున్నా ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు.

ఆత్మీయ సమ్మేళనం

కడెం: మండల కేంద్రంలోని ప్రాజెక్ట్ దిగువన ఆదివారం ఏకలవ్య ఫౌండేషన్ కుటుంబాలు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆటాపాటలతో ఉల్లాసంగా గడిపారు. సామూహిక భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడారు. ఫౌండేషన్ ద్వారా సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేసే విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కష్టం, సుఖం, బాధ, ఆనందం, ఆత్మీయత, అనురాగం అన్నీ కలగలిసిన అద్భుత ప్రపంచమే కుటుంబమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు ఆవులు మృతి

జైనథ్: మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ షాక్‌తో రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. వైన్స్ వెనకాల గల కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో విద్యుత్ షాక్ తగిలి ఆవులు మృతిచెందాయని బాధిత రైతు రాజు తెలిపాడు. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.


మృతిచెందిన ఆవులను చూపిస్తున్న రైతు రాజు

కొత్త లక్ష్యం..

కొత్త ఆశలు, ఆశయాలతో యువత సిద్ధమైంది. ఈ ఏడాది కొలువు సాధించడమే తమ లక్ష్యమని అంటోంది. ప్రణాళికాబద్ధంగా చదివి గమ్యాన్ని చేరుకుంటామని చెబుతోంది. నూతన సంవత్సరం సందర్భంగా పలువురిని 'సాక్షి' పలుకరించగా తమ మనోగతం వెల్లడించారిలా..

- నిర్మల్‌ఖిల్లా/నిర్మల్/ఆదిలాబాద్‌టౌన్

నోటిఫికేషన్లు ఇవ్వాలి



నిర్మల్: ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా వర్క్ ఫ్రం హోమ్ చేస్తున్నాను. ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేరేషన్ మొదలుపెట్టాను. ఈఏడాది సీరియస్‌గా చదవాలన్న లక్ష్యంతో ఉన్నాను. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం కూడా జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు ఇవ్వాలి. **– రక్షా జాస్మిన్, బీటెక్, నిర్మల్**

జాబ్ కోసం ప్రిపరేషన్



నిర్మల్: మాది కడెం మండలకేంద్రం. ప్రస్తుతం హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్నాను. నా కాళ్లపై నేను నిల్చోవాలన్న లక్ష్యంతో ఉద్యోగం కోసం ప్రిపేరవుతున్నాను. కచ్చితంగా సాధిస్తానన్న నమ్మకం ఉంది. **– గ్లోరియా ఆకర్షిత, డిగ్రీ, కడెం**

లక్ష్యం దిశగా శ్రమిస్తేనే



నిర్మల్‌ఖిల్లా:నిరంతరం శ్రమిస్తేనే ఉద్యోగం, వ్యాపార రంగంలో సాధించగలం. ఆత్మ విశ్వాసం కోల్పోకుండా, ఆటంకాలు ఎదురైన ముందుకు కొనసాగితే లక్ష్యం చేరుకుంటాం. యువత ఆ దిశగా ముందుకెళ్లాలి. ఈ సంవత్సరం వారు అనుకున్న లక్ష్యం నెరవేరాలి. **– డాక్టర్ మధు, అసిస్టెంట్ ప్రొఫెసర్, నిర్మల్**

అప్రమత్తంగా ఉండాలి



ఆదిలాబాద్‌రూరల్: ప్రస్తుతం కోవిడ్ కొత్త వేరియంట్ వ్యాపిస్తోంది. బీపీ, షుగర్, అస్తమా, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి. మాస్కులు ధరించాలి. రిమ్స్‌లో వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. ఎవరికీ ఆందోళన వద్దు. నూతన సంవత్సరంలో మరిన్ని నాణ్యమైన సేవలందిస్తా. **– డాక్టర్ సుమలత, రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్**

ఈసారి ఉద్యోగం సాధిస్తా



నిర్మల్‌ఖిల్లా:2024 ఉద్యోగ నామ సంవత్సరం కావాలని కోరుకుంటున్నా. ఈ సంవత్సరం ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. మెగా డీఎస్సీ, ఇతర గ్రూప్ ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు నేపథ్యంలో ఉద్యోగ లక్ష్యంగా ముందుకు సాగుతున్నా. **– తక్కలపల్లి సునీల్ కుమార్, బీరవెల్లి**

కొలువు సాధించడమే లక్ష్యం..



ఆదిలాబాద్‌టౌన్:వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేయాలి. ఉద్యోగాల భర్తీతోనే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కష్టపడి చదివి కొలువుల కోసం ఎదురుచూస్తున్న వారికి కొత్త ఏడాది కలిసిరావాలి. ప్రణాళిక బద్ధంగా చదివితే కొలువు సాధించవచ్చు. **– బి.అమూల్య, యువతి, ఆదిలాబాద్**

ఈసారి ఎస్సై కోసం..



నిర్మల్: మాది బాన్సువాడ. భైంసా డిగ్రీకాలేజీలో ఫైనలియర్ చదువుతున్నాను. గతేడాది వరకు కానిస్టేబుల్‌కు ప్రిపేరయ్యాను. ఈ ఏడాది డిగ్రీ కంప్లీట్ అవుతుంది. ఈసారి ఎస్సై కోసం ప్రిపేర్ కావాలన్న లక్ష్యం పెట్టుకున్నాను. అందుకు తగ్గట్లు ప్రణాళికాబద్ధంగా ప్రయత్నం చేస్తాను. **– మేఘన, డిగ్రీ ఫైనలియర్, భైంసా**

దృఢసంకల్పంతో..



ఆదిలాబాద్‌టౌన్:కొత్త ఏడాదిలో నా లక్ష్య సాధన కోసం మరింత దృఢంగా కృషి చేస్తాను. గతేడాది అర్ధాంతరంగా మిలిగిన పనులు ఈయేడు పూర్తి చేసే దిశగా ముందుకెళ్తాను. గత అనుభవాలు నెమరువేసుకుని ప్రత్యేక ప్రణాళికతో ఉద్యోగ సాధనే లక్ష్యంగా చదువుతాను. నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆశిస్తున్నాను. **– సి.కావ్య, యువతి, ఆదిలాబాద్**

ముందుకు సాగాలి



ఆదిలాబాద్‌టౌన్: కొత్త సంవత్సర వేడుకలు జరుపుకున్నప్పుడు క్యాలెండర్‌లో తేది మాత్రమే మారుతోంది. కానీ ఈ నూతన సంవత్సరం అందరి జీవితాల్లో సంతోషాలు నింపాలి. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. యువత అనుకున్న లక్ష్యాలను నెరవేర్చే దిశగా కష్టపడి ముందుకు సాగాలి. **– సాక్షి, విద్యార్థిని, ఆదిలాబాద్**

నూతన ఉత్తేజంతో ముందుకు..



ఆదిలాబాద్‌టౌన్: కొత్త ఏడాదిలో నూతన ఉత్తేజంతో ముందుకు సాగుతాను. గతేడాది అనుకున్న లక్ష్యాలు చేరుకుంటాను. ప్రభుత్వ కొలువు సాధించే దిశగా ముందుకు సాగుతాను. ఉపాధ్యాయ వృత్తిలో చేరి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడమే నా ప్రధాన లక్ష్యం. **– కె.వైష్ణవి, ఛాత్రోపాధ్యాయురాలు**

ఉద్యోగ సాధనే లక్ష్యం



నిర్మల్: మాది పుస్పూర్ గ్రామం. అమ్మానాన్న వ్యవసాయం చేస్తూ చదివిస్తున్నారు. వారి కష్టానికి తగ్గట్లు చదువుతున్నాను. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ ఉద్యోగ సాధనే లక్ష్యంగా పెట్టుకుంటున్నాను. ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వాలి. **– విజేత, డిగ్రీ ఫైనలియర్, భైంసా**

ఆపన్నహస్తం అందించరూ..

- రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు
- దాతల సాయం కోసం ఎదురుచూపు

భైంసాటౌన్: అప్పటిదాక స్నేహితులతో సరదాగా గడిపిన రాకేశ్(రోబో) పరిస్థితి రోడ్డు ప్రమాదంతో ఒక్కసారిగా మారిపోయింది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలు కాగా, ప్రస్తుతం మెరుగైన చికిత్సకు దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నాడు. వివరాల్లోకి వెళితే.. భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లికి చెందిన రాకేశ్ స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. అమ్మ బీడీలు చుడుతుండగా, నాన్న బీడీ కంపెనీపై వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. సొంత ఇల్లు కూడా లేక అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో ఈనెల 29న రాత్రి స్నేహితులతో కలిసి బైక్‌పై భైంసా వైపు వస్తుండగా ఆర్టీసీ డిపో వద్ద మరో బైక్‌ను ఢీకొట్టడంతో రాకేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్‌కు తరలించగా అక్కడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మెదడులో కొన్నిచోట్ల రక్తం గడ్డ కట్టడంతో ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. ఇందుకు రూ.8లక్షలకుపైగా ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పినట్లు కుటుంబీకులు, స్నేహితులు తెలిపారు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో అంత డబ్బు ఎక్కడి నుంచి తేవాలోనని రాకేశ్ తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దాతలు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.


చికిత్స పొందుతున్న రాకేశ్

ఆర్థిక సహాయం అందించాలంటే..
ఫోన్‌పే/గూగుల్‌పే నంబర్ 94943 17930
ఎస్‌బీఐ బ్యాంకు ఖాతా 52138922047

నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గంగాధర్

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ నాల్గో తరగతి కేంద్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొండూరి గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. హైదరాబాద్‌లోని సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో గంగాధర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ అసోసియేషన్ సహా అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు నియామక పత్రం అందజేశారు. ఆయన ఎన్నికపై సంఘం జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.


నియామక పత్రాన్ని అందుకుంటున్న కొండూరి గంగాధర్

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి గాయాలు


గాయపడిన వెంకటేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దొనబండకు చెందిన పొట్టాల వెంకటేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. మంచిర్యాల నుంచి దొనబండలోని ఇంటికి బైక్‌పై తిరిగి వస్తున్న క్రమంలో గుడిపేట వద్ద మరో బైక్ వేగంగా ఢీకొట్టింది. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడు సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. వెంకటేశ్ తలకు తీవ్ర గాయాలు కాగా మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది.

గుంతలో పడిన ఐచర్ వ్యాన్

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలోని గుంతలో ఐచర్ వ్యాన్ దిగబడింది. ఈ సమయంలో అటుగా ఎవరు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ షాహిద్ వివరాల ప్రకారం... హైదరాబాద్ నుంచి కోడిగుడ్లు తీసుకొని ఉత్తరప్రదేశ్‌లోని జన్‌షీర్ వెళ్తుంది. ఇందారం క్రాస్ రోడ్డు వద్ద వ్యాన్ డ్రైవర్ దారి తప్పి చెన్నూర్‌కు వచ్చాడు. దారి తప్పి వచ్చిన విషయాన్ని స్థానికులు తెలుపడంతో వ్యాన్ తిరుగు ప్రయాణంలో నడి రోడ్డుపై గల గుంతలో పడిపోయింది. అంబేద్కర్ చౌరస్తా జనసంచారం ఉన్న ప్రాంతం కావడంతో వ్యాన్ బోల్తా పడితే పెను ప్రమాదం సంభవించేదని స్థానికులు చెబుతున్నారు.

కళల 'రాజేంద్ర'


పేపర్‌పై దేవి విగ్రహాన్ని తీర్చిదిద్దుతున్న రాజేంద్ర

నిర్మల్‌ఖిల్లా: ఓ వ్యక్తి ఒకటి, రెండు కాదు..విభిన్న కళల్లో తన ప్రతిభ కనబరుస్తున్నాడు. ఆయనే నిర్మల్ వాసి బిట్లింగు రాజేంద్ర. అందమైన దస్తూ రితో కాలిగ్రాఫర్‌గా, సూక్ష్మ చిత్రకళతో మినీయేచరిస్ట్‌గా, కాన్వాస్‌పై పెయింటింగ్‌నూ రాణిస్తున్నారు. ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన కళాకారుడిపై సాక్షి కథనం.

- విభిన్న కళలతో ప్రతిభ
- సూక్ష్మ చిత్రకళ, శిల్పకళల్లో రాణింపు
- ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన నిర్మల్ వాసి

ఉపాధి నిమిత్తం ముంబైలో..

జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్ వాస్తవ్యుడైన బిట్లింగు రాజేంద్ర ఉపాధి నిమిత్తం ప్రస్తుతం ముంబైలో నివసిస్తున్నాడు. ఆరుపదుల వయసులో విభిన్న కళల్లో ఆరితేరి ఔరా..అనిపిస్తున్నాడు. ప్రస్తుతం ఓ ప్రముఖ యాడ్ ఏజెన్సీలో పనిచేస్తుండగా, మరోవైపు బియ్యపు గింజలపై విభిన్న చిత్రాలు గీస్తున్నాడు.

కళలపై అభిరుచి..

రాజేంద్ర పదేళ్ల వయసులో చిత్రకళపై మక్కువ పెంచుకున్నాడు. టెన్త్ పూర్తయిన తర్వాత ఉన్నత చదువుల కంటే కళలపై ఉన్న అభిరుచిని వృత్తిగా మలుచుకున్నాడు. కాలిగ్రఫీలో ముద్రణలాగా ఉండే వీరి చేతిరాత (దస్తూరి) చూపరులను ఇట్టే ఆకట్టుకుంటోంది. శిల్పకళలో జీవకళ ఉట్టిపడేలా దేవతామూర్తులు, దేశనాయకుల విగ్రహాలను తీర్చిదిద్దుతున్నారు. దుర్గాదేవి అమ్మవారు, బతుకమ్మ పండుగ చిత్రాలు, రామాయణం, మహాభారతం, ఇతిహాసాలు, ప్రకృతి రమణీయతను ప్రదర్శించే చిత్రాలు, దేశప్రముఖుల చిత్రపటాలు గీయడంలో ఈయనకు సాటి ఎవరూ లేరు.

భగవద్గీతతో అరుదైన గుర్తింపు

భగవద్గీతను దాదాపు 8 మిల్లీమీటర్లు, 15 మిల్లీమీటర్ల పరిమాణంలో 4 సూక్ష్మ గ్రంథాల్లో భగవద్గీత మొత్తం 18 అధ్యాయాలను సూక్ష్మీకరిస్తూ తీర్చిదిద్దాడు. సూక్ష్మగ్రంథాల్లో 18 అధ్యాయాలతోపాటు 701 శ్లోకాలు చేతిరాతతోనే గ్రంథస్తం చేశాడు. పది రోజుల్లోనే పూర్తిచేసి వారం క్రితమే హార్వర్డ్ వరల్డ్ రికార్డులో నమోదు కావడంతో అరుదైన గుర్తింపు పొందాడు. భగవద్గీత గ్రంథంలో ఒక్కొక్క చిత్రం ఒక్క మిల్లీమీటర్ పరిమాణంలో ఉండడం విశేషం. ఇంత సూక్ష్మంగా అబ్బురపర్చే చిత్రాలు గీయడం, గ్రంథాలు, శిల్పాలు, ప్రతిమలను తీర్చిదిద్దడం, కాన్వాస్ పెయింటింగ్ చేయడం ఈయన ప్రత్యేకత. బియ్యపు గింజలపై లతామంగేష్కర్, కార్గిల్ విజయం, అబ్దుల్ కలాం, తిరుమల శ్రీవేంకటేశ్వరుడు వంటి ప్రతిమలను రూపొందించారు. దేవతామూర్తుల శిల్పాలు రూపుదిద్దడం, కాన్వాస్‌లపై అందమైన వేసిన ప్రకృతి చిత్రాలు ఎన్నో ఉన్నాయి. ప్రముఖుల నుంచి ప్రశంసలు, పురస్కారాలు సైతం అందుకున్నారు.


రాజేంద్ర రూపొందించిన మినీయేచర్ భగవద్గీత



రాజేంద్ర రాసిన చేతిరాత

అభిరుచిగా మొదలైంది



చిన్నప్పటి నుంచి అభిరుచిగా మొదలైన సూక్ష్మచిత్రకళ, కాన్వాస్‌పై పెయింటింగ్, శిల్పాలు చెక్కడంలో నిమగ్నమయ్యాను. పలు యాడ్ ఏజెన్సీలకు పనిచేశాను. కళలతో కూడిన అంశాలతో మినియేచర్ ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నదే నా ప్రధాన ఆకాంక్ష.

– బిట్లింగు రాజేంద్ర, కళాకారుడు, నిర్మల్

విద్యార్థులు లక్ష్యంతో ముందుకుసాగాలి

- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్

ఇంద్రవెల్లి: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే విజయం సాధిస్తారని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించారు. పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థులు తోడసం వెంకటలక్ష్మి, నరసింహస్వామిలు ఆగాఖాన్ అకాడమీ హైదరాబాద్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సీటు వచ్చిందుకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం పాఠశాలలో సమస్యలపై ప్రిన్సిపాల్ కాంబ్లే అనిల్, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనం పూర్తయినా అనుమతి ఇవ్వలేదని నిర్వాహకులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నతశిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ విజయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎంపీ సోయంకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు